సాక్షి తిరుపతి

సోమవారం, 7, అక్టోబర్, 2024



ఆధునికం.. ఆహ్వానం

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అం దిపుచ్చుకుంటూ నేటి యువతరం ఆహ్వాన పత్రికలను రూపొందిస్తోంది. - 8లో



2 కోట్ల భూమి కబ్జాకు యత్నం

శ్రీకాళహస్తిలో సుమారు రూ.2కోట్ల భూమిని ఆక్రమించుకోవడానికి అధికార పార్టీ నాయకులు యత్నిస్తున్నారు. - 8లో



కనుల పండువగా..

తుమ్మలగుంటలో కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 75,552 మంది స్వామివారిని దర్శించుకోగా 35,885 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.54 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయంకంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

టీటీడీ డిగ్రీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్), శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల (అటానమస్), శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల(అటానమస్), ఎస్వీ ప్రాచ్య(ఓరియంటల్) కళాశాల, ఎస్వీ సంగీత నృత్య కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు టీటీడీ జేఈవో గౌతమి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం విద్యార్థులు అక్టోబరు 7 నుంచి 9వ తేదీ వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఆయా కళాశాలల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి హాస్టల్ వసతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఉండవని తెలిపారు.

కలెక్టరేట్‌లో నేడు గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందని వివరించారు. అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులు హాజరు కావాలని సూచించారు. డివిజన్, మండల స్థాయిలోనూ అధికారులు సోమవారం తప్పకుండా గ్రీవెన్స్ చేపట్టాలని చెప్పారు.

ముత్యపు పందిరిలో..
తేజోమయుడు



సింహ వాహనంపై శ్రీవారు

ఇల వైకుంఠం బ్రహ్మోత్సవ శోభతో అలరారుతోంది. గోవిందనామస్మరణతో మార్మోగుతోంది. బ్రహ్మదేవుడు స్వయంగా నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవం కనులపండువగా సాగుతోంది. మూడో రోజు ఉదయం సింహ వాహన సేవ కోలాహలంగా సాగింది. రాత్రి ముత్యపు పందిరిపై బకాసుర వధ అలంకరణలో అభయమిచ్చిన శ్రీవారిని దర్శించుకున్న భక్తలోకం పులకించిపోయింది.



ముత్యపు పందిరిలో విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

- అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహన సేవ
- స్నపన తిరుమంజనంలో సేద తీరిన ఉత్సవమూర్తులు
- కోలాహలంగా సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుమల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు అంబరాన్ని తాకేలా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం ఉదయం సింహవాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనాలపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. సింహవాహన సేవలో స్వామివారు యోగ నృసింహుని రూపంలో భక్తులను అనుగ్రహించారు. అనంతరం స్వామివారు ఉభయ దేవేరులతో కలసి స్నపన తిరుమంజనంలో సేద తీరారు. ఆ తర్వాత ఆలయం వెలుపల కొలువు మండపంలో వేయి నేతి దీపాల వెలుగులో స్వామివారు శ్రీమన్నారాయణుని రూపంలో ఊయలూగుతూ కనువిందు చేశారు. రాత్రి నిర్వహించిన ముత్యపుపందిరి వాహన సేవకు భక్తుల సందడి పెరిగింది. వాహన సేవల ముందు సాంస్కృతిక శోభ ఉట్టిపడింది. వివిధ రాష్ట్రాలకు చెందిన 20 కళా బృందాలలో 530 మంది కళాకారులు చూడచక్కని ప్రదర్శనలతో భక్తులను కట్టిపడేశారు. టీటీడీ ఈవో, అదనపు ఈవో, జేఈవో తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆంక్షలు

ఈ సారి బ్రహ్మోత్సవాలకు టీటీడీ కఠినమైన ఆంక్షలు విధించింది. కొండపైకి చేరుకున్న భక్తులను ఎక్కడపడితే అక్కడ అడ్డుకుంటూ నిర్బంధించేస్తోంది. దీంతో భక్తులు గ్యాలరీకి చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి కొందరు గ్యాలరీలోకి వెళ్లలేక వెనుదిరుగుతున్నారు. ఫలితంగా గ్యాలరీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మూడో రోజు ఉత్సవంలో కూడా భక్తుల సందడి తగ్గింది.

సిబ్బందికి వస్త్ర బహుమానం

బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న వాహన బేరర్లు, మేళం సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి సేలంకు చెందిన మెక్కినేశ్వరి టెక్స్‌టైల్స్ అధినేత తంగదురై దంపతులు వస్త్ర బహుమానం అందజేశారు. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి చేతుల మీదుగా వస్త్రాలను అందించారు.








శివ పార్వతుల నృత్యాభినయం




కళాకారుల ప్రదర్శన



శ్రీవారి గరుడసేవకు విస్తృత ఏర్పాట్లు

తిరుమల: తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేదీ సాయంత్రం శ్రీ మలయప్ప స్వామి గరుడ వాహనంపై సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు విహరిస్తారని టీటీడీ ఈవో జె శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆదివారం సాయంత్రం ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ఈవో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 2 లక్షల మంది భక్తులు గ్యాలరీల్లో వేచి ఉండే విధంగా ఏర్పాట్లు చేపట్టినట్టు వెల్లడించారు. గరుడ సేవ దర్శనం కోసం ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవింద నిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా దర్శనం కల్పిస్తామన్నారు. వారి సౌకర్యార్థం అన్ని పాయింట్ల వద్ద అవసరమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సామాన్యుడికి ధరల దడ





- ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ చిరుద్యోగిగా పనిచేస్తున్న నారాయణ నెల జీతం రూ.16వేలు. తిరుపతి కొర్లగుంటలో నెలకు రూ.5వేలు చెల్లించి అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పాలు, పెరుగు, పప్పుదినుసులు వంటి నిత్యావసర సరుకులకు నెలకు సుమారు రూ. 5వేల వరకు ఖర్చు అవుతుంది. దీనికి తోడు కూరగాయలకు వారానికి రూ.1000 అవసరమవుతున్నాయి. అంటే నెలకు రూ.4వేలకు పైబడి ఖర్చు అవుతోంది. మిగిలి రూ.2వేలతో పిల్లల ఖర్చులు, వాహనానికి పెట్రోలు, ఈఎమ్‌ఐలు, చేతి ఖర్చులు అంతా మరో రూ.10వేలు అప్పు చేస్తున్నాడు. నిత్యావసరల ధరలకు తగ్గట్టు జీతభత్యాలు పెరగలేదని వాపోతున్నాడు.



- పప్పుదినుసులు, కూరగాయలు సామాన్యునికి దొరకడంలేదు. జీవనం భారమైంది. కనీసం రెండు పూటలా నాలుగు వేళ్లు నోటిలోకి వెళ్లడం లేదంటూ తిరుపతి జీవకోనకు చెందిన పరశురాం అనే దినసరి కూలీ ఆవేదన చెందుతున్నాడు. ఇద్దరు పిల్లలు, భార్య దివ్యాంగురాలు. ఒక్కడు కష్టపడి నలుగురు తినాల్సిన పరిస్థితి. రోజు కూలీ దొరికితే రూ.600 ఇస్తారు. వారానికి నాలుగురోజులు కూడా పని దొరకడం కష్టంగా మారింది. టమాటా కిలో రూ.100కు చేరింది. ఉల్లి రూ.60 నుంచి 80వరకు పలుకుతోంది. ఆ కుటుంబం కూరగాయలు తినేందుకే భయపడుతోంది. పొద్దున పిల్లలకు మాత్రం టిఫిన్ పెట్టి ఇంటి యజమానులు పస్తులు ఉంటున్నారు. మధ్యాహ్నం, రాత్రి సంగటి, పచ్చడితో కాలం గడుపుతున్నారు. నిత్యావసరాలు పెరగడం, కూరగాయల ధరలు మండుతుండడంతో వాటి జోలికి వెళ్లలేదంటూ కన్నీటిని దిగమింగుతూ మదనపడుతున్నారు.

- కొండెక్కిన కూరగాయలు, ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాలు
- మార్కెట్లలో సెంచరీ దాటిన టమాటా
- చుక్కలు చూపిస్తున్న ఉల్లి ధరలు
- సాగును గాలికి వదిలేసిన సర్కారు
- దిక్కుతోచని స్థితిలో సామాన్యుడు

తిరుపతి సిటీ: జిల్లాలో కూరగాయల ధరలు కొండెక్కి కూర్చొన్నాయి. వీటికి తోడు తానేమీ తీసిపోనంటూ నిత్యావసరధరలు సైతం ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజల దుస్థితి వర్ణనాతీతం. బతుకు జీవుడా అంటూ రెక్కడాతేగాని డొక్కాడని దినసరి కూలీల పరిస్థితి దారుణంగా మారింది. ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెరగక సగటు వేతన జీవి అల్లాడిపోతున్నాడు. ఏమి తినాలన్నా మార్కెట్‌లో ధరలు దడ పుట్టిస్తున్నాయి. కూరగాయలను తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుంటే పెరిగిన ధరల మాట వింటూనే గుండెల్లో దడ పుడుతోంది. కిలో కొనుగోలు చేసే ప్రజానీకం ప్రస్తుతం పావు కిలో (250 గ్రాములు) మాత్రమే కొనే పరిస్థితి ఉంది.

కూరగాయలు	కిలో.ధర రూ.	నిత్యావసరాలు	కిలో రూ.
టమాటా	100	కంది పప్పు	196
ఉల్లి	75	పెసర పప్పు	170
వంకాయ	50	వేరుశెనగ	160
బెండ	55	మినపప్పు	163
పచ్చిమిర్చి	70	శెనగపప్పు	140
వెల్లుల్లి	400	కారంపొడి	350
బీరకాయ	85	ధనియాలు	290
దొండ	80	పసుపు	140
గోరు చిక్కుడు	70	పామాయిల్	130
బీన్స్	90	వేరుశనగ నూనె	210
క్యారెట్	70	సన్‌ప్లవర్	160
బీట్‌రూట్	90	కొబ్బరి నూనె	400
బంగాళదుంప	65	పంచదార	54

తగ్గిన కూరగాయల సాగు విస్తీర్ణం

కూరగాయల ధరలు పెరగడానికి ప్రధాన కారణం తెలుగు రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం పెద్ద ఎత్తున తగ్గడం. దీనికి తోడు కూరగాయల సాగు అధికంగా ఉండే జిల్లాల్లో వరదలు బీభత్సం సృష్టించడంతో పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. తిరుపతి జిల్లాలో కూరగాయల సాగు సుమారు 2 వేల ఎకరాలు ఉండగా ఈ ఏడాది కేవలం వెయ్యి ఎకరాల్లోనే సాగవుతోంది. అందులోనూ పంట దిగుబడి రాక పోవడం. ఇతర రాష్ట్రాల నుంచి పూర్తి స్థాయిలో టమాటా, ఉల్లి సరఫరా లేకపోవడంతో ధరలు మండుతున్నాయి. మార్కెటింగ్ శాఖ అంచనా ప్రకారం తిరుపతిలో రోజుకు 3వేల టన్నుల కూరగాయలు అవసరం ఉండగా, ప్రస్తుతం 1500 టన్నులు మాత్రమే సరఫరా అవుతున్నాయి.

సెంచరీ దాటిన టమాటా

ఇంటిలో ఏ కూర చేయాలన్నా టమాటా, ఉల్లి తప్పనిసరి. ప్రస్తుతం టమాటా ధర సెంచరీ దాటింది. రిటైల్ షాపుల్లో రూ.100 నుంచి 110 వరకు పలుకుతోంది. రైతు బజార్‌లోనే రూ.85 ఉందంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఉల్లిగడ్డ ధరలు నాణ్యత, రకాన్ని బట్టి రూ.65 నుంచి 90వరకు పలుకుతున్నాయి. బెండ, చిక్కుడు, కాకర, బీట్‌రూట్, క్యారెట్, వంగ, బీన్స్, బంగాళదుంప వంటి కూరగాయలు ప్రస్తుతం తిరుపతి మార్కెట్‌లో రూ.50 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. నిత్యావసర సరుకుల పరిస్థితి దారుణంగా తయారైంది. పప్పు దినుసుల రకాన్ని బట్టి కిలో రూ.150 నుంచి 200 వరకు పలుకుతున్నాయి. వంట నూనె కిలో రూ.180 దాటింది. మసాలాలు నాలుగు నెలల్లో 25 శాతం రేట్లు పెరిగాయి.

కూరగాయల ధరలు దారుణం



గతంలో రూ.500 తీసుకుని మార్కెట్‌కు వెళ్లితే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం రూ.1000కు కొనుగోలు చేసినా బ్యాగు నిండడం లేదు. దారుణంగా రేట్లు పెరగడంతో ఏమీ కొనలేకపోతున్నాం. కూరగాయలు బంగారంలా తయారవుతున్నాయి. ప్రభుత్వం ధరలు తగ్గించే ప్రయత్నం చేయాలి.

– సుబ్బలక్ష్మి, గృహిణి. తిరుపతి

ధరలు పెరగడంతో వ్యాపారం లేదు



ధరల పెరుగుదలతో కూరగాయలు కొనేందుకు ప్రజలు భయపడుతున్నారు. కిలో కొనే వారు కేవలం అరకిలో, పావుకిలోతో సరి పెట్టుకుంటున్నారు. టమాటా రూ.20కి అమ్మేవాళ్లం. నేడు రూ.100కి అమ్ముతున్నాం. గతంలో రోజుకు 20కిలోలు అమ్మేవాళ్లం ఇప్పుడు రెండు కిలోలు విక్రయించడమే గగనంగా మారింది.


– రాణెమ్మ, కూరగాయల వ్యాపారి, తిరుపతి



విక్రయిస్తున్న కూరగాయలు

కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం

కూరగాయల పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చొరవ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. విత్తన సరఫరా, వ్యవసాయ అధికారులనుంచి సమాచారలోపం, డిమాండుకు తగ్గ దిగుమతులు చేసుకోలేకపోవడం, రైతు మార్కెట్లలో సబ్సిడీ ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. మరోవైపు ధరల నియంత్రణపై అధికారులు దృష్టి సారించకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ధరల పెరుగుదల, నియంత్రణ, బ్లాక్‌మార్కెట్ వంటి అంశాలపై జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేసే కమిటీ జాడలేదు. దీంతో కొందరు వ్యాపారులు నిత్యావసరాలు అక్రమంగా నిల్వ ఉంచి కృత్రిమ కొరతను కల్పించి ధరలను విపరీతంగా పెంచుతున్నారు.



మళ్లీ వీఆర్వోల బదిలీలు

తిరుపతి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో ప్రజాప్రతినిధుల ముద్ర తెలిసిందే. అయితే ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఎమ్మెల్యేల ఆదేశాలతో గ్రేడ్–1 వీఆర్వోలను గ్రేడ్–2గాను, గ్రేడ్–2 వీఆర్వోలను గ్రేడ్–1గా మార్పులు చేశారంటూ వీఆర్వోల సంఘం నేతలు కొద్ది రోజులుగా గగ్గోలు పెడుతున్నారు. దీంతో చిక్కులు తప్పవని వారు హెచ్చరిస్తూ వచ్చారు. మరోవైపు ప్రజా ప్రతినిధులు తాము ఇచ్చిన జాబితాల్లోనే కొన్ని మార్పులు చేయాలంటూ మరోసారి జిల్లా అధికారులపై ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గత నెల 22వ తేదీకే బదిలీల గడువు ముగిసింది. అయితే అధికార పార్టీ నేతలు ఇచ్చిన జాబితా మేరకు బదిలీలు చేయాల్సి రావడంతో సెప్టెంబర్ 28వ తేదీన వీఆర్వో బదిలీల జాబితాను అధికారులు విడుదల చేశారు. జోన్–3 పరిధిలోని 71 మంది, జోన్–4 పరిధిలోని 171 మంది మొత్తంగా 242 మంది వీఆర్వోలను బదిలీలు చేశారు. అయితే బదిలీలు పారదర్శకంగా చేపట్టలేదని పలు విమర్శలు ఎదురుకావడంతో అధికారులు డోలాయమానంలో పడ్డారు. దానికి తోడు మరికొన్నిచోట్ల మార్పులు చేయాలని నేతలు ఆదేశాలు ఇవ్వడంతో ఆదివారం 113 మంది వీఆర్వోల బదిలీల్లో మార్పులు చేపట్టారు. దీనిపై పలువురు వీఆర్వోలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి బదిలీలు చేసిన తర్వాత మళ్లీ ఎంటీ బదిలీలు అంటూ మండిపడుతున్నారు. అయితే మూడో సారి వీఆర్వోల బదిలీలతోపాటు కొందరు తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని మరోవర్గం రెవెన్యూ అధికారులు బాహాటకంగానే చెబుతున్నారు.

289 మంది సచివాలయ ఉద్యోగుల బదిలీ

ప్రభుత్వం 15 విభాగాల్లో బదిలీలు చేపట్టడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అందులో సచివాలయ ఉద్యోగుల విభాగం ఒకటి. 14 విభాగాల్లో బదిలీలు పూర్తి అయినప్పటికీ సామాజిక భద్రత ఫించన్ల పంపిణీ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు బ్రేక్ పెట్టారు. అయితే ఆదివారం జిల్లాలో 289 మందిని బదిలీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గ్రేడ్ 1–4 వరకు చెందిన ఉద్యోగులు 172 మంది, గ్రేడ్–5కి చెందిన వారు 95 మంది, గ్రేడ్–6 పరిధిలోని వారు 22 మంది ఉన్నారు. ఇందులోనూ రాజకీయ జోక్యం ఉందని యూనియన్ నేతలు బాహాటకంగానే విమర్శలు చేస్తున్నారు.

గరుడ సేవను జయప్రదం చేద్దాం

- బందోబస్తు పోలీసు అధికారులతో సమీక్ష
- రాష్ట్ర శాంతి భద్రతల ఐజీ సీహెచ్.శ్రీకాంత్

తిరుపతి క్రైమ్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు మంగళవారం నిర్వహించే గరుడోత్సవాన్ని విజయవంతం చేయాలని శాంతి భద్రతల ఐజీ సి.హెచ్. శ్రీకాంత్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఆయన ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐజీ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే చాలా ప్రతిష్టాత్మకమైన బందోబస్తు విధులను నిర్వర్తించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గరుడ సేవకు విచ్చేసే భక్తులను గౌరవించి, వారితో మర్యాదగా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. భక్తులు ఎవరు మాడవీధుల్లోకి రాకుండా సెక్టార్ అధికారులు జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. క్యూలు, ఎంట్రీ పాయింట్ల మధ్య సమన్వయం ఉండాలని, గ్యాలరీల్లో ఎలాంటి తోపులాటలు జరగకుండా అప్రమత్తంగా పనిచేయాలన్నారు. భక్తులకు సేవలు అందిస్తూనే అనుమానితులను ఒక కంట కనిపెట్టుకొని ఉండాలన్నారు. ఇందులో డీఐజీతోపాటు ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గరుడవాహన రోజున ట్రాఫిక్ మళ్లింపులు

తిరుమలలో ఈనెల 8వ తేదీన నిర్వహించే శ్రీవారి గరుడ సేవకు వచ్చే భక్తుల కోసం ట్రాఫిక్‌ను మళ్లించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుమలలో 8 వేల వాహనాలకు మాత్రమే పార్కింగ్ సౌకర్యం ఉందని తెలిపారు. యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులను అదనంగా వేశామని సురక్షితంగా వాటిలో ప్రయాణం చేయాలని సూచించారు. పార్కింగ్ సంబంధించిన క్యూఆర్ కోడ్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ సీహెచ్.శ్రీకాంత్

పార్కింగ్ వివరాలు

- ద్విచక్ర వాహనాలు సోమవారం ఉదయం 9 గంటల నుంచి 9 తేదీ బుధవారం ఉదయం 6 గంటల వరకు అనుమతించరు.
- చెర్లోపల్లి నుంచి వచ్చే వాహనాలను జూపార్క్ రోడ్డులో ఉన్న దేవలోక్ పార్కింగ్ ప్రాంతంలో నిలిపిఉంచాలి.
- నంది సర్కిల్ వద్దకు వచ్చిన వాహనాలను అన్నారావు సర్కిల్ మీదుగా ఇస్కాన్ గ్రౌండ్‌కు మళ్లించనున్నారు.
- టౌన్ క్లబ్ నుంచి రుయా ఆస్పత్రి జంక్షన్ వద్దకు వచ్చిన వాహనాలను ఇస్కాన్ గ్రౌండ్‌కు, ఎస్వీ మెడికల్ కాలేజ్ గ్రౌండుకు, నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్‌కు మళ్లించనున్నారు.

పార్కింగ్ ప్రాంతాలు

- అలిపిరి ఓల్డ్ చెక్ పాయింట్ వద్ద కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే పార్కింగ్ చేయాలి.
- తిరుమలలో జీఎన్సీ నుంచి వచ్చే వీవీఐపీ పెద్ద బ్యాడ్జెస్ వాహనాలు రాంభగీచ పార్కింగ్ ప్రాంతంలో నిలిపిఉంచాలి
- వీఐపీ చిన్న బ్యాడ్జెస్ ఉన్న వాహనాలు ముల్లగుంట, సప్తగిరి గెస్ట్ హౌస్ పార్కింగ్ ప్రాంతాల్లో ఉంచాలి.
- సాధారణ వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా పార్కింగ్ ప్రాంతాలకు మళ్లించనున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తులకు గడువు పెంపు

తిరుపతి అర్బన్: టూరిజం విభాగం వారు నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించి ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 30వ తేదీ వరకు గడువు ఇచ్చామని చెప్పారు. అయితే అందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 25వ తేదీ వరకు పెంచామని వెల్లడించారు. వీడియోలు లేదా రీల్స్‌ను edtpt@aptdc. in లేదా collector. tirupati@ap. gov. in మెయిల్‌కు ఈనెల 24వ తేదీ లోపు పంపాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 63099 42027, 98488 23086, 97059 33311 ను సంప్రదించగలరని కోరారు.

జాతీయ అథ్లెటిక్ పోటీలకు నాయుడుపేట విద్యార్థిని


ప్రతిభ చూపిన కృపప్రిన్సి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణానికి చెందిన కృప ప్రిన్సి అనే విద్యార్థిని జాతీయ స్థాయి జరిగే అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై ంది. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజి గ్రౌండ్‌లో జరుగుతున్న అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో నాయుడుపేటకు చెందిన విద్యార్థిని కృప ప్రిన్సి పాల్గొని, 600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఈ నెల 17వ తేదీ నుంచి 19 వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది.

ఆధునికం.. ఆహ్వానం

- స్మార్ట్‌గా ఇన్విటేషన్లు
- డిజిటల్ కార్డులతో పిలుపులు
- వీడియోలతో వాట్సాప్ మెసేజ్‌లు
- ప్రింటింగ్ కార్డు సంస్కృతిని వదిలేసిన ప్రజలు


క్యూఆర్ కోడ్‌తో తయారు చేసిన డిజిటల్ వెడ్డింగ్ కార్డులు

తిరుపతికి చెందిన శ్రీనివాస్ కుమారుడు యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తన కొడుకు వివాహానికి ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల్లోని బంధుమిత్రులకు ఆహ్వానం పంపేందుకు సన్నాహాలు చేపట్టారు. సమయం కేవలం 12 రోజుల మాత్రమే ఉండడంతో అందరికీ పత్రికలు పంచేందుకు వీలుకాని పరిస్థితి. కుమారుడి సలహా మేరకు బెంగళూరుకు వెళ్లి క్యూర్ స్కానర్‌తో వీడియో వెడ్డింగ్ కార్డులు, ఏటీఎం తరహాలో డిజిటల్ కార్డులు డిజైన్ చేయించారు. కేవలం 10 నిమిషాల్లోనే వాట్సాప్ ద్వారా బంధుమిత్రులకు ఆహ్వానం పలికేశారు. సరికొత్త ట్రెండ్‌తో అందించిన పెళ్లిపిలుపుపై ప్రతి ఒక్కరూ అభినందనలు తెలిపారు.

తిరుపతి సిటీ : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వివాహ, శుభకార్యాలకు ఆహ్వానించే విధానం వినూత్నంగా మారింది. గతంలో వివాహాది శుభకార్యాలకు బంధుమిత్రులకు పిలవాలంటే కనీసం నెల రోజుల ముందుగా వెడ్డింగ్ కార్డులు ముద్రించి వ్యయ ప్రయాసలకోర్చి గడపగడపకు వెళ్లి పంచాల్సి వచ్చేది. మారుతున్న కాలంతో పాటు అది కాస్తా ఫోన్ కాల్స్, మెసేజ్‌ల రూపంలోకి వచ్చేసింది. డిజిటల్ ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఆధునిక యుగంలో ఆహ్వాన పత్రికలు వీడియో వెడ్డింగ్ కార్డుల రూపంలో హల్‌చల్ చేస్తున్నాయి. మరింత ముందుకు వెళ్లిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ వెడ్డింగ్ కార్డులు వచ్చేశాయి.

ఏటీఎం తరహాలో కార్డులు

పెళ్లికి బంధుమిత్రులను పిలించేందుకు క్యూఆర్ కోడ్‌తో ప్రింట్ చేసిన ఏటీఎం తరహా కార్డులు ప్రస్తుతం మార్కెట్‌లో విస్తృతంగా వాడుకలో ఉన్నాయి. వీడియో వెడ్డింగ్ ఇన్విటేషన్స్‌తో పాటు ఉన్నతస్థాయి బంధుమిత్రుల కోసం విజిటింగ్ కార్డ్స్ రూపంలో ఉండే డిజిటల్ వెడ్డింగ్ కార్డులు పంపుతున్నారు. ఏపీలో తొలిసారి పశ్చిమగోదావరి జిల్లాలో ఓ కాంట్రాక్టర్ తన కుమారుడి వివాహం కోసం ఈ తరహా కార్డులను తయారు చేయించారు. ఇందులో కార్డుపై భాగంలో వధూవరుల ఫొటో, పేర్లు, ఆహ్వానించు తల్లిదండ్రుల పేర్లు మాత్రమే ఉంటాయి. వెనుక భాగంలో క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వివాహానికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. పెళ్లిమండపం అడ్రస్, లొకేషన్ మ్యాప్, పెళ్లి పత్రిక, విందు టైమింగ్స్, ముహూర్త సమయంతో పాటు సంప్రదించాల్సిన వధువు, వరుడి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు పొందుపరిచి ఉంటాయి.



ఇప్పుడు ఇదే ట్రెండ్

డిజిటల్ యుగంలో యువత బర్త్ డే, ఎంగేజ్‌మెంట్, గ్రాడ్యుయేషన్, బేబీ షవర్, ఆఫ్ శారీ ఫంక్షన్స్, గృహప్రవేశాలు వంటి అన్ని శుభకార్యాలకు వీడియో కార్డుల ద్వారా ఆహ్వానాలను వాట్సాప్‌లో పంపుతున్నారు. ఇంటర్నెట్, కంప్యూటర్‌పై అవగాహన ఉన్న ప్రతి వ్యక్తీ ఉచిత టెంప్లెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమకు నచ్చిన డిజైన్‌లలో ఆహ్వాన పత్రికలను తయారు చేసేస్తున్నారు. కరోనా తర్వాత ఆహ్వానాలను డిజిటల్ పద్ధతిలో పంపేందుకే ప్రజలు ఇష్టపడుతున్నారు.


ఏటీఎం తరహాలో తయారైన డిజిటల్ వెడ్డింగ్ కార్డులు

ప్రింటింగ్ కార్డులపై తగ్గిన మోజు

వివాహ మహోత్సవంలో ప్రధాన భూమిక పోషించే వెడ్డింగ్ కార్డులు కాలానుగుణంగా రూపు మార్చుకుంటున్నాయి. బ్లాక్ అండ్ వైట్ కార్డులతో మొదలైన పెళ్లి పత్రికలు తర్వాత కలర్, యూవీ, లేజర్, ఫొటో ప్రింట్, సౌండ్ సిస్టమ్ కార్డులుగా మారాయి. ఈ ట్రెండ్ కొంత కాలం కొనసాగింది. రూ.2 నుంచి సుమారు రూ.20 వరకు ఒక్కోకార్డు ప్రింటింగ్ ధర ఉండేది. ప్రస్తుతం నయా ట్రెండ్ మొదలైంది. డిజిటల్ యుగంలో వీడియో వెడ్డింగ్ కార్డులు మార్కెట్‌ను శాసించాయి. ప్రస్తుతం క్యూఆర్ కోడ్‌స్కానర్‌తో రూపొందించిన డిజిటల్ కార్డుల వైపు యువత మొగ్గు చూపుతోంది. దీంతో ప్రింటింగ్ ప్రెస్ దుకాణాలు వెలవెలబోతున్నాయి.

విశేషంగా స్పందన

మా కాబోయే అల్లుడు లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మాది కొత్త బంధుత్వం. ఆగస్టు 14న బెంగళూరులోని కల్యాణ మండపంలో సెప్టెంబర్ 2న వివాహం జరిపేందుకు పండితులు ముహూర్తం పెట్టారు. వధువరూలు ఆగస్టు 20న ఇండియాకు వచ్చారు. పదిరోజులు మాత్రమే సమయం ఉంది. బంధుమిత్రులకు ఎలా ఆహ్వానం పంపాలనే ఆలోచనలో పడ్డాం. మా అల్లుడి సలహాతో ఏటీఎం కార్డు సైజులో క్యూఆర్ కోడ్‌తో ఉన్న డిజిటల్ కార్డులను తయారు చేసి అందరికీ వాట్సాప్ ద్వారా పంపించాం. బంధుమిత్రులు ఇబ్బంది లేకుండా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని కల్యాణ మండపానికి విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. చాలా సంతోషంగా అనిపించింది.

– కోటేశ్వరరావు, తిరుపతి

ప్రింటింగ్ కార్డులు తగ్గాయి



గతంలో ప్రతి ఏడాది జూలై, ఆగస్ట్, సెప్టెంబర్‌లో సుముహూర్తాలు ఉన్నందున పెళ్లి కార్డుల ప్రింటింగ్‌కు ప్రజలు ఎగబడేవారు. బిజినెస్ అంతా ఆ మూడు మాసాల్లోనే జరిగేది. నగరంలోని ప్రతి ప్రింటింగ్ ప్రెస్ నిర్విరామంగా పనిచేసేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గ్రామీణ ప్రాంత వాసులు మాత్రం అడపాదడపా తక్కువ క్వాంటిటీతో పెళ్లి పత్రికల కోసం వస్తున్నారు. సుమారు 50 శాతానికి పైగా బిజినెస్ తగ్గింది. కంప్యూటర్ కాలం, డిజిటల్ ఫోన్లు రాకతో పత్రికలకు డిమాండ్ భారీగా పడిపోయింది.

– వెంకటేశ్వర్లు, ప్రింటింగ్ ప్రెస్ యజమాని, తిరుపతి

జాతీయ రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థి


రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులతో పీడీ చంద్రశేఖర్‌రాజు

పుత్తూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్ర గ్రీకో రోమన్ రెజ్లింగ్ అండర్–17 పోటీల్లో వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రావణ్‌కుమార్ 92 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. అలాగే మరో విద్యార్థి ఉదయ్‌కుమార్ 71 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. శ్రావణ్‌కుమార్ ఈ నెల 22వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. వారిని హెచ్ఎం కరుణ నవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు అభినందించారు.


అట్టహాసంగా ముగిసిన మోహన మంత్ర


మోహన మంత్ర ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

చంద్రగిరి: శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థలో మూడు రోజులుగా జరుగుతున్న మోహన మంత్ర–2023 కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా ముగిసింది. హర్రర్ హౌస్ విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది. అందులోని విద్యార్థులు వేసిన వేషాలు పిల్లలను భయభ్రాంతులకు గురిచేసింది. టాయ్స్ మాస్క్ సెల్ఫీ, బెలూన్ స్మాష్, ఫొటో ఫ్రేమ్‌లకు ఫోజులిస్తూ విద్యార్థులు కేరింతలు కొట్టారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన విద్యార్థులకు మోహన మంత్ర కో–ఆర్డినేటర్ దేవరాజులు కృతజ్ఞతలు తెలిపారు. పొరబాట్లను సరిచేసుకుని 2025లో మోహన మంత్ర జాతీయ స్థాయి పండుగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తామన్నారు. ఈ సంప్రదాయం ఇలాగే కొనసాగుతుందని ప్రో చాన్సలర్ మంచు విష్ణు తెలిపారన్నారు.

కనుల పండువగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవం

- సింహ వాహనంపై యోగ నరసింహుడు..
- ముత్యపు పందిరిలో మూడునామాల వాడు
- భక్తుల నడుమ శ్రీవారి ఊంజల సేవ


ముత్యాల పందిరిలో విహరిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో మూడవ రోజు ఆదివారం ఉదయం స్వామి వారు యోగ నరసింహుని అవతారంలో సింహ వాహనాన్ని అధిరోహించి భక్తులను ఆశీర్వదించారు. స్వామి వారి గర్భాలయంలోని మూలమూర్తికి ఉదయం సుప్రభాతం, తోమాల, అర్చన, పంచాంగ శ్రవణం వంటి దైనందిన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని యోగ నరసింహుని అవతారంలో ముస్తాబు చేసి సింహ వాహనంపై కొలువు దీర్చారు. ఆ తర్వాత వేద పండితుల మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్యన సింహ వాహన సేవ ముందుకు కదిలింది. స్వామి వారి వాహన సేవలు సాగే వీధుల్లో హారతి కేంద్రాలను ఏర్పాటు చేయగా గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని హారతులు అందించారు. తిరుచానూరు, పాడిపేట, ముండ్లపూడి పంచాయతీల నుంచి ప్రజలు సారెను సమర్పించారు. సారె తీసుకువచ్చిన భక్తులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముత్యపు పందిరిలో మూడు నామాల వాడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి ముత్యపు పందిరిలో కొలువు దీరిన మూడు నామాల వాడు భక్తులకు చల్లని దీవెనలు అందించారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు ముత్యాల పందిరిలో కాళీయ మర్ధన చిన్నిక్రిష్ణుడి అవతారంలో అనుగ్రహించారు. నవరత్నాలలో ముత్యం ఒకటి. ముత్యం చంద్రునికి ప్రతీక. ఆరోగ్య ప్రదాతగా కూడా చంద్రుడిని కొలుస్తారు. చల్లదనాన్ని ప్రసాదించే చంద్రుడిని ప్రతీకగా చెప్పే ముత్యపు పందిరిలో కొలువైన శ్రీవారు భక్తులను దీవించగా భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.


సింహవాహన సేవలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

కన్నుల పండువగా ఊంజల సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 5.30గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు ఊంజల సేవను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. అన్నమయ్య సంకీర్తనలు, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి ఊంజల సేవ వైభవంగా సాగింది. ఆలయం ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేకంగా పూజలు, హారతులు అందించి ఊంజల సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డితో పాటు గ్రామపెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

- 9వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు
- జిల్లాలో 227 దుకాణాలకు 162 దరఖాస్తులు
- మీడియాకు వెల్లడించిన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

తిరుపతి క్రైం: మద్యం దుకాణాలకు ఎవరైనా స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోవచ్చని తిరుపతి, చిత్తూరు జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ టి.విజయశేఖర్ పేర్కొన్నారు. తిరుపతి అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 11 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 227 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించామని, అయితే ఇప్పటి వరకు 162 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని చెప్పారు. గతంలో ఒక్కో వ్యక్తి ఒక్క దుకాణానికి మించి దరఖాస్తులు చేయరాదనే నిబంధనలు ఉండేవని చెప్పా రు. అయితే ప్రస్తుతం ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకు అయినా దరఖాస్తు చేసుకునే సౌలభ్యం కల్పించా రని వివరించారు. 21ఏళ్లు దాటిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతానికి చెందిన వారైనా వారికి ఇష్టం వచ్చిన ప్రాంతంలో దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉందని తెలియజేశారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 11వ తేదీ ఉదయం 8గంటల నుంచి తిరుచానూరులోని శిల్పారామంలో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయిస్తామని చెప్పారు.

నిబంధనలు తప్పనిసరి

దుకాణం దక్కించుకున్న వ్యాపారి మండల పరిధిలో అయితే ఆయనకు ఇష్టం వచ్చిన ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. అయితే అదే మండలంలో మరో చోటుకి మార్పు చేయాలంటే ఎక్సైజ్ నిబంధనలు అనుసరించాలని పేర్కొన్నారు. రెండేళ్లపాటు దుకాణాలకు లైసెన్స్ ఉంటుందని చెప్పారు. దేవాలయాలు, పాఠశాలలకు 100 మీటర్ల దూరంలో మాత్రమే దుకాణాలు పెట్టుకోవాలని ఆదేశించారు. తిరుపతి నగరం ఆధ్యాత్మిక ప్రాంతం నేపథ్యంలో రైల్వేస్టేషన్, తిరుపతి బస్టాండ్, అలిపిరి నందిసర్కిల్, లీలా మహల్ సర్కిల్, విష్ణునివాసం, శ్రీనివాసం రుయా ఆస్పత్రి, స్విమ్స్ ఆస్పత్రి ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ఆ ప్రాంతాల్లో భక్తులు, రోగులు ఉంటున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు లేకుండా ఆ ప్రాంతాలను నిషేధించినట్లు వెల్లడించారు. సమావేశంలో ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు దశల్లో చెల్లించవచ్చు

దుకాణానికి కేటాయించిన మొత్తాన్ని ఆరు దశల్లో చెల్లించవచ్చని చెప్పారు. ముందుగా తొలి దశ మొత్తాన్ని చెల్లిస్తేనే 12వ తేదీ నుంచి దుకాణాలు నడుపుకునే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. మిగిలిన ఐదు దశల మొత్తానికి 30 రోజుల్లోపు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. లాటరీ పద్ధతి లో ఒక్కో దుకాణానికి ముగ్గురుని ఎంపిక చేస్తామని చెప్పారు. మొదటి వ్యక్తి తొలి దశ మొత్తాన్ని చెల్లిస్తే ఆయనకు ఇస్తామని, లేదంటే రెండో వ్యక్తికి, లేదంటే మూడో వ్యక్తికి ఇవ్వనున్నట్లు వివరించారు.

రూ.2 కోట్ల భూమి కబ్జాకు యత్నం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: శ్రీకాళహస్తి మండలం మన్నవరం మార్గంలో తిమ్మవరం గ్రామ పరిధిలోని రూ.20కోట్లు విలువైన 10 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అనుచరులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ స్థలాన్ని జేసీబీతో చదును చేయగా, స్థానికులు కొందరు అడ్డుకున్నారు. మండలంలోని తిమ్మవరం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 141లో 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మన్నవరం భెల్ మార్గం కావడంతో ఈ విలువైన భూమిపై గతంలోనూ కొందరు ఆక్రమణకు యత్నించడంతో స్థానికులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు ఆ భూమిని కాపాడారు. అయితే ఇటీవల భెల్ పరిశ్రమ అభివృద్ధి కోసం కలెక్టర్ వెంకటేశ్వర్ వచ్చి పరిశీలించారు. ఈ నేపథ్యంలో రియల్టర్ల కన్ను మరోసారి ఈ ప్రాంతంపై పడింది. కొందరు టీడీపీ నాయకులు ఈ భూమిని రెండు రోజుల నుంచి జేసీబీలతో చదును చేస్తున్నారు. అయితే ఆదివారం గ్రామస్తులు అడ్డుకోవడంతో పనులను ఆపేశారు. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు కొందరు బడా నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయాల్లో తిష్ట వేసి వేకంట్ పొజిషన్ ఉన్న సర్వే నంబర్లపై దృష్టి పెట్టి నకిలీ పట్టాలను సృష్టించి కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పచ్చనేతల చెర నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.


తిమ్మవరం సమీపంలో మొక్కలు తొలగించిన ప్రభుత్వ భూమి

లడ్డూలకు ఆధార్ స్కానింగ్!

తిరుమల : ఆధార్‌కార్డు ఆధారంగా శ్రీవారి భక్తులకు ఇకపై సులభంగా, వేగంగా లడ్డూలను అందించేందుకు టీటీడీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు శ్రీవారి దర్శన టికెట్లు లేని భక్తులకు ఆధార్‌కార్డుకు రెండు లడ్డూలను పంపిణీ చేసేవారు. ఇందులో భక్తుడు తన ఆధార్‌కార్డు లడ్డూ కౌంటర్లో ఇస్తే సిబ్బంది దానిపై ఉన్న పేరు, నంబర్‌ను కంప్యూటర్లో నమోదుచేసుకుని లడ్డూలను ఇచ్చేవారు. దీంతో ఎక్కువ సమయం వృథా అయ్యేది. దీని నుంచి ఉపశమనం కల్పించేలా టీటీడీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఆధార్ కార్డు స్కాన్ చేసేవిధంగా అధునాతన స్కానర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ స్కానర్ ముందు ఆధార్‌కార్డు ఉంచగానే కంప్యూటర్లో ఆధార్‌లోని వ్యక్తి పూర్తి వివరాలు ప్రత్యక్షమవుతాయి. దీంతో త్వరగా భక్తులకు లడ్డూలను అందించేందుకు వీలుపడుతుంది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా లడ్డూ కౌంటర్లలోని 56 నుంచి 61 కౌంటర్ల వరకు ఈ విధానాన్ని పరిశీలిస్తున్నారు. త్వరలోనే మిగిలిన కౌంటర్లలోనూ ఈ నూతన విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.